నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిటిషన్..

పెద్దోళ్లకు సలాం.. పేదోళ్లపైనే ప్రతాపం!

- ఖాజాగూడలోని 27.18 ఎకరాల సర్కారు భూముల్లోనే నిర్మాణాలు
- సర్కారు కండ్ల ముందే శరవేగంగా 42 బహుళ అంతస్థుల భవనాలు
- రేవంత్ సర్కారు ఉదాసీనతపై కోర్టు కెక్కిన పార్టీ ఎమ్మెల్యేలు
- చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేసినా హైడ్రా పట్టించుకోలేదన్న అనిరుధ్
- చర్చనీయాంశంగా మారిన 'ముఖ్య'నేత తెర వెనక మంత్రాంగం
- అక్షర సత్యాలుగా 'నమస్తే' కథనాలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఏడాదిన్నర రేవంత్‌రెడ్డి పాలనలో సామాన్యుడే సమిధ. నిరుపేద ప్రభుత్వ భూమిలో గుడిసె వేసినా! సామాన్యుడు లక్షలు పెట్టి అన్ని అనుమతులతో ఇల్లు కట్టుకున్నా!! జీహెచ్‌ఎంసీ.. హైడ్రా.. రెవెన్యూ.. ఇరిగేషన్.. తెల్లారక ముందే ఏదో ఒక రూపంలో బుల్డోజర్ వస్తుంది. నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేసి ఆ కుటుంబాలను వీధినపడేస్తుంది. ఇదేమంటే... స్థానికులే ఫిర్యాదు చేశారని సమాధానాలొస్తాయి. మరి ఈ ఏడాది మార్చి 13న సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మీడియా ముందు ఒక ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో చెరువును ఆక్రమించి ఓ నిర్మాణ సంస్థ ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్నదని ఆరోపించారు. హైడ్రాకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ ప్రాజెక్టు చేపట్టిన 27.18 ఎకరాలు ప్రభుత్వ పోరంబోకు భూమి. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ' ఆ సమయంలోనే అన్ని వివరాలతో గుట్టు రట్టు చేసింది. ప్రభుత్వ పెద్దలు సహా అన్ని విభాగాలు ష్... గప్‌చుప్!!

సీన్ కట్ చేస్తే...

అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు.. ఏకంగా హైకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఖాజాగూడ పరిధిలోని సర్వే నంబరు 27లో చెరువును కబ్జా చేయడంతోపాటు 27.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఒక నిర్మాణ సంస్థ అక్రమంగా బిల్డింగులు నిర్మిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఏడాదిన్నరగా నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలకు చెందిన వందల నిర్మాణాలను కూల్చివేసిన ప్రభుత్వ, అధికార యంత్రాంగం దాదాపు రూ.2వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడటంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. ప్రజలకు చెందిన విలువైన భూములు, ఓ నీటి వనరును కాపాడటంతో సొంత ప్రభుత్వంలోనే న్యాయం దొరకడంలేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు హైకోర్టు తలుపుతట్టారు. మరి... 'కోర్టులో కేసు ఉంది' అంటూ ప్రభుత్వ పెద్దలు చెప్పే కథలాగే ఈ ఎపిసోడ్ కూడా అటకెక్కుతుందా? లేక ఏడాదిన్నరగా నిరుపేద, మధ్యతరగతి ప్రజలపై ప్రదర్శించిన బుల్డోజర్ న్యాయాన్ని అమలు చేస్తారా? అన్నది ఉత్కంఠ రేపుతున్నది.

గత ప్రభుత్వం రద్దు చేసినా..

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, ఖాజాగూడ పరిధిలోని సర్వేనంబర్ 27లో సుమారు 64.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 27.18 ఎకరాల భూమిపై 80వ దశకం నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతున్నది. 2022లో అప్పటి జిల్లా ఉన్నతాధికారి దానికి ఎన్‌వోసీ ఇవ్వడం.. దాని ఆధారంగా నిర్మాణ సంస్థ అక్కడ సుమారు 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడు టవర్లను నిర్మించేందుకు అనుమతి తీసుకున్నది. అప్పటి ప్రభుత్వ పెద్దలు విషయం తెలుసుకొని ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకున్నారు. వాళ్ల ఆదేశానుసారం సీసీఎల్‌ఏ ఉన్నతాధికారి జిల్లా ఉన్నతాధికారి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడంతోపాటు ఎలాంటి అనుమతులు చెల్లవని ఉత్తర్వులు ఇచ్చారు. ఆ భూమిలో సదరు సంస్థ వేసిన షెడ్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో 2023 డిసెంబరు వరకు ఆ ప్రభుత్వ భూమి సర్కారు ఆధీనంలోనే ఉంది.

కాంగ్రెస్ హయాంలో మొదలు..

గత ప్రభుత్వ హయాంలో సర్కారు ఆధీనంలోనే ఉన్న ఆ భూములు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేటు వశమయ్యాయి. ప్రభుత్వ భూముల్ని తమ ఆధీనంలోకి తీసుకున్న సదరు నిర్మాణ సంస్థ పక్కన ఉన్న చెరువు మీదా కన్నేసి అందులో మట్టి పోసింది. ఈ క్రమంలో ఏడాదిగా అక్కడ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలు అంతస్తుల నిర్మాణం పూర్తయింది. ఖాజాగూడలో ఎకరా ధర కనీసం రూ.90 కోట్ల నుంచి రూ.100 కోట్ల మధ్య ఉన్నది. అంటే 27.18 ఎకరాల భూమి విలువ రూ.2000 కోట్ల పైమాటే! రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్, చుట్టుపక్కల గత ఏడాదిన్నరగా సామాన్యుడు ఇంచు ప్రభుత్వ భూమిలోకి జరిగినా, గజం చెరువు బఫర్‌లో కలిసినా.. నిర్దాక్షిణ్యంగా నేలకూలుతున్నాయి. కానీ నెలల తరబడి ప్రభుత్వ, అధికార యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడ లేదు. దీంతో తెరవెనక పెద్దలెవరూ లేకుండా ఈ నిర్మాణాలు కొనసాగవన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఓ ప్రైవేటు సంస్థ పాగా వేసి దర్జాగా ఏడాది నుంచి భారీ నిర్మాణ ప్రాజెక్టును కొనసాగిస్తున్నదంటే తెర వెనక చక్రం తిప్పింది ఎవరు? అనేది తేలాలన్న డిమాండు వినిపిస్తున్నది.

కొనుగోలు చేసే సామాన్యుడి గతేంది?

ఏడాదిన్నరగా రాష్ట్రంలో రియల్-నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి అంటూ ప్రభుత్వ పెద్దలు సర్దుబాటు ప్రకటనలు చేస్తున్నారు. కానీ ఇదే సర్కారు పెద్దల వైఖరి ఈ రంగంపై పిడుగుపాటుగా మారిందనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి హైదరాబాద్ మహా నగరంలో సుమారు రూ.15వేల కోట్ల విలువైన 11 భారీ నిర్మాణ ప్రాజెక్టులు అక్రమమని చెప్పారు. అప్పటికే వాటిలో వేల మంది సామాన్యులు లక్షలు వెచ్చించి ఫ్లాట్లు కొనుగోలు చేశారు. ఇంకా వేల సంఖ్యలో ఫ్లాట్లు అమ్ముడుపోవాల్సి ఉంది. ఇదేరీతిన ఏడాదిన్నర కిందట వచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కండ్ల ముందే ఖాజాగూడ ప్రభుత్వ భూములు, చెరువులో ఆకాశహర్మ్యాలు రూపుదిద్దుకుంటున్నాయి. పైగా ఈ అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఇది అక్రమం అంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరి.. ఇందులో ఫ్లాట్లు కొనుగోలు చేయాలా? వద్దా? కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నిరకాల అనుమతులు ఇచ్చిందన్న నమ్మకంతో కొనుగోలు చేసిన వారి భవిష్యత్తుకు ఎవరు పూచీ?

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- అందుకే కోర్టును ఆశ్రయించాం
- హైకోర్టులో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిల్
- సర్వే నంబరు లేకపోవడంపై హైకోర్టు అసహనం
- విచారణ 2 వారాలకు వాయిదా

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు సర్వే నంబర్లు మార్చేసి 47 అంతస్థులతో కూడిన ఎనిమిది భవనాలను కడుతున్నారని తెలుపుతూ అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నలుగురు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తే చర్యలు శూన్యమని, అందుకే హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. ఐటీ కారిడార్‌లో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం సర్వే నం 27లో 27.18 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల వశం అయ్యిందని, సుమారు రూ.5 వేల కోట్ల విలువైన ఆ భూమిలో బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మురళీనాయక్ భూక్యా, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి సంయుక్తంగా దాఖలు చేసిన పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. 1955- 58 కాస్రా పహణీలో (పాత సర్వే నం. 117/3/1) సర్వే నం 27లోని 27.18 ఎకరాల భూమి ప్రభుత్వ పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని తెలిపారు. అయితే, సర్వే నంబర్లను మార్చేసి భూమిని కాజేశారని చెప్పారు. ట్రస్టీగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం వల్లే కోట్ల రూపాయల ఆస్తిని కాపాడాలన్న మహత్తర సంకల్పంతో పిటిషనర్లు పిల్ దాఖలు చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. వినతిపత్రంలో సర్వే నంబర్ లేదని చెప్పింది. ఏది అక్రమ నిర్మాణమో, ఏ ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు నిర్మాణాలు చేస్తున్నారో ఎలా తెలుస్తుందని ప్రశ్నించింది. మీరు కనీసం ఆ గ్రామానికి చెందిన వారు కాదు, వినతిపత్రం సరిగ్గా ఉండాలి అని తేల్చి చెప్పింది. దీనిపై న్యాయవాది కల్పించుకుని, ప్రభుత్వ భూమిని రక్షించాలన్నదే తమ ఉద్దేశమని, ప్రభుత్వమే తన భూమిని రక్షించకపోతే ఎలాగంటూ సందేహం వ్యక్తం చేశారు. దీనిపై హైకోర్టు.. సర్వే నంబర్ ఇతర వివరాలతో వినతి పత్రం అధికారులకు సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

సర్వే నంబర్ మార్చి అక్రమ నిర్మాణాలు

సర్వే నంబర్ 119, 122 (పాతవి) భూమికి చెందిన సర్వే నంబర్‌ను తప్పుగా నమోదు చేస్తూ 1995 జనవరి 30న ప్రొసీడింగ్స్ (నం డి1/6770/1993) ఇచ్చారని పిటిషనర్ చెప్పారు. సర్వే నంబర్ 27లో 27.18 ఎకరాలు ప్రభుత్వ పోరంబోకుగా అధికారులు తేల్చారని, కాస్రా పహణి 1955- 58 (పాత సర్వే నం 117/3/1) సర్వే నం 27లోని 27.18 ఎకరాల భూమిని ప్రభుత్వ పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. సర్వే నంబరు మార్పు చేసి ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తులు తమ స్వాధీనంలోకి తెచ్చుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని చెప్పారు. సర్వే నంబరు మార్చారని, రంగారెడ్డి కలెక్టర్ ఎన్వోసీ జారీతో నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అనుమతి ఇచ్చేసిందని చెప్పారు. ఈ అక్రమాలపై పూర్తి వివరాలతో అధికారులకు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. 1996లో పహణీ ప్రకారం కూడా 27.18 ఎకరాల భూమి ప్రభుత్వ పోరంబోకు అని చెప్పారు. అయితే, ఈ భూమిని పల్లవి (భర్త కొమురయ్య)-మల్కాజిగిరి, బెవర్లీ హిల్స్ యజమానుల సంక్షేమ సంఘ సభ్యులకు బదిలీ చేశారని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చేశారని చెప్పారు. ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 24న జీపీఏ హోల్డర్ రంగంలోకి వచ్చారని, బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి సోహిని బిల్డర్స్ -జూబ్లీహిల్స్ జీపీఏ తీసుకుని ప్రభుత్వ భూమిలో 47 అంతస్థులతో ఎనిమిది టవర్లు నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. పనులు వేగంగా జరుగుతుంటే ప్రభుత్వ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇదే భూమిలో ఖాజాగూడ చెరువు కూడా ఉందని, సమీపంలోనే ఓక్రిడ్జ్ స్కూల్‌కు 150 మీటర్ల దూరంలో రెడీమిక్స్ యూనిట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ ప్రాంతంలో బిల్డింగ్ నిర్మాణ పనులకు చెందిన కాంక్రీట్ మిక్సింగ్ యూనిట్ పెట్టి కాలుష్యానికి తెర తీశారని ఆరోపించారు. ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పనులు జరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం చేకూర్చే చర్యలు ఉన్నా అధికారులు స్పందించడం లేదన్నారు. తెలంగాణ రెవెన్యూ చట్టం-1371ఎఫ్ నిబంధనను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని 14, 21, 300ఏ ఉల్లంఘన కూడా ఉందని, జీహెచ్‌ఎంసీ యాక్ట్-1955 ఉల్లంఘన అవుతున్నదని చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో విన్నవించారు.

వివరాల్లేకుండా వినతి పత్రమా?

వినతి పత్రంలో సర్వే నంబర్ వివరాలు లేకుండా ఇస్తే ఎలాగని పిటిషనర్లైన ఎమ్మెల్యేలను హైకోర్టు ప్రశ్నించింది. హైదరాబాద్, గచ్చిబౌలి ప్రాంతంలోని భూమి అంటే ఎక్కడ అని అడిగింది. గచ్చిబౌలి అంటే చాలా విస్తీర్ణం ఉంటుందని, ఆఫీసర్లు ఎక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని ప్రశ్నించింది. ఫలానా ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు నిర్మాణాలు చేస్తున్నారని తెలియజేయకపోతే ఆఫీసర్లు ఎలా చర్యలు తీసుకోగలరని ప్రశ్నించింది. భూమి సర్వే నంబర్ లేకుండా వినతిపత్రం ఇవ్వడం వల్ల ఉపయోగం ఏముటుందని వ్యాఖ్యానించింది. సర్వే నంబర్‌తో సమగ్ర వివరాలతో సంబంధిత ఆఫీసర్లుకు తాజాగా వినతి సమర్పించాలని ఎమ్మెల్యేలను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎం రేవంత్‌పై నల్లగొండ నేతల గుస్సా

చెప్పాపెట్టకుండా ఇన్‌చార్జి మంత్రులుగా తొలగింపుపై కినుక
కొత్త ఇన్‌చార్జి మంత్రిపైనా కనీస సమాచారం లేదని ఆగ్రహం
మంత్రి పదవులు రాలేదని రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్ నారాజ్
రానున్న రోజుల్లో తామేంటో చూపుతామంటున్న అసంతృప్తి నేతలు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి నల్లగొండ మంత్రులకు మధ్య చెడిందా? వీరి మధ్య వైరం తారస్థాయికి చేరిందా? ఇక తాడోపేడో అన్న పరిస్థితులు నెలకొంటున్నాయా? అన్న అనుమానాలకు రాష్ట్ర సర్కార్‌లో జరుగుతున్న పరిణామాలు అవుననే అంటున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను మార్చడం వీరిమధ్య మరింత అగాథాన్ని మరింత పెంచినట్టు తెలుస్తున్నది. కనీస సమాచారం ఇవ్వకుండా సీనియర్ మంత్రులైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖను ఇన్‌చార్జి మంత్రుల బాధ్యతల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి తప్పించారు. ఇందులో నల్లగొండకు చెందిన ఇద్దరు మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డిపై గుర్రుగా ఉన్నట్టు, సమయం కోసం వేచిచూస్తూ తామేంటో స్పష్టం చేయాలన్న పంతంతో రగిలిపోతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

శాఖలు వదులుకోలేదనే కోతలు

ఆరంభం నుంచే రేవంత్‌రెడ్డికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మధ్య సత్సంబంధాలు లేవన్నది అందరికీ తెలిసిందే. అధికారిక కార్యక్రమాల్లో పైకి ఐక్యంగా కనిపించినా..లోలోపల మాత్రం ఎవరివారే అన్న తీరు కొనసాగుతున్నది. తన మంత్రిత్వ శాఖల్లో సీఎం సహా ఎవరూ జోక్యం చేసుకోకుండా మంత్రి ఉత్తమ్ జాగ్రత్త పడుతూ వస్తున్నారు. అలాగే తనకు సంబంధం లేని సీఎం, డిప్యూటీ సీఎం శాఖల్లోనూ ఆయన జోక్యం చేసుకోవడానికి విముఖత చూపుతుంటారు. ఇక పార్టీ వ్యవహారాల్లో సైతం ఉత్తమ్ అధిష్ఠానం కనుసన్నల్లో పని చేస్తూ వస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించి అధిష్ఠానం సైతం ఉత్తమ్‌ను సంప్రదించకుండా ఏ నిర్ణయం తీసుకోదన్నది కాంగ్రెస్ వర్గాలే చెప్తుంటాయి. ఇలాంటి కీలక నేత, ఏదైనా అనుకోని సందర్భం వస్తే సీఎం అయ్యే అర్హతలు ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి బాధ్యతల నుంచి తప్పించారు. ఇక నల్లగొండ జిల్లాకే చెందిన మరో మంత్రి, ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో అందరికంటే సీనియర్ నేతగా చెప్పుకునే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరంభంలో రేవంత్‌రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఎన్నికైన సమయంలో ఏకంగా రూ. 50లక్షలు పెట్టి అధ్యక్ష పదవిని కొన్నాడని బహిరంగంగానే విమర్శలు చేసిన వ్యక్తి ఆయన. ఎన్నికల ముందు వరకు రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ అధికారంలోకి రావడంతో రేవంత్‌రెడ్డికి జీహుజూర్ అన్నట్టుగా మారిపోయారు. రేవంత్‌రెడ్డిపై ఈగ వాలనివ్వనంతగా ఓ దశలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటనలు వెలువడ్డాయి. కోమటిరెడ్డి బలాలు బలహీనతలు తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి తన రాజకీయ, ప్రభుత్వ అవసరాలకు తగ్గట్టుగా ఆయనను పావుగా వాడుకుని వదిలేసాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌చార్జి మంత్రుల మార్పులు చేర్పుల్లో కోమటిరెడ్డిని కూడా పక్కన పెట్టేశారు.

కనీసం సమాచారం లేక...

ఈ నెల 12న ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి మార్చిన సంగతి తెలిసిందే. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉన్న కరీంనగర్ ఇన్‌చార్జి బాధ్యతలను తుమ్మల నాగేశ్వర్‌రావుకు, వెంకట్‌రెడ్డికి ఉన్న ఖమ్మం బాధ్యతలను కొత్త మంత్రి వాకిటి శ్రీహరి అప్పగించారు. ఈ మార్పుల విషయాన్ని సీఎం రేవంత్.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, వెంకట్‌రెడ్డికి కనీసం సమాచారం లేదు. వాస్తవంగా వీరితోపాటు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు చేస్తారని, కొత్త మంత్రులకు వీళ్ల నుంచి పలు శాఖలను తొలగించి అప్పగిస్తారన్న చర్చ జరిగింది. ఉత్తమ్ నుంచి సివిల్ సప్లై, కోమటిరెడ్డి నుంచి సినిమాటోగ్రఫీ శాఖలను తొలగించాలన్నది రేవంత్‌రెడ్డి అభిప్రాయంగా తెలిసింది. కానీ వీరు ఒప్పుకోకపోవడంతో విధిలేక కొత్త మంత్రులకు సీఎం తన వద్ద ఉన్న శాఖలనే కేటాయించాల్సి వచ్చింది. శాఖల మార్పులపై తన మాటను లెక్కచేయలేదన్న అక్కసుతో రేవంత్‌రెడ్డి వీరిద్దరిపై పంతం నెగ్గించుకునేందుకు ఏకంగా వారి జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలను తొలగించినట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇన్‌చార్జి మంత్రుల బాధ్యతల నుంచి తొలగించడంపై వీరిద్దరూ లోలోపల తీవ్రంగా రగిలిపోతున్నారని వారి అనుచరులు చెప్తున్నారు. తమ సన్నిహితుల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. సీనియర్లమైన తమనే తీవ్రంగా అవమానపరిచే రీతిలో రేవంత్‌రెడ్డి వ్యవహరించడాన్ని వీరిద్దరూ జీర్ణించుకోలేకపోతున్నట్టు తెలిసింది. పైగా వీరికి పనిభారం తగ్గించేందుకే ఇన్‌చార్జి మంత్రుల బాధ్యతల నుంచి తప్పించినట్టు సీఎం కోటరీ ప్రచారం చేయడం కూడా వీరికి అస్సలు మింగుడుపడడం లేదు. పార్టీపై, ప్రభుత్వంపై పట్టు కోసం తమతో పాటు మరికొందరు సీనియర్ల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అవమానకరరీతిలో వ్యవహరిస్తున్నట్టు వీరు భావిస్తున్నారని సమాచారం.

ఇతర నేతలు సైతం...

సీఎం రేవంత్‌రెడ్డి తీరుతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత కొంతకాలంగా సయోధ్యతో కనిపిస్తున్నారు. వీరికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కూడా తోడయ్యారు. తనకు మంత్రి పదవికి రాకుండా ఉత్తమ్ అడ్డుపడుతున్నట్టు తొలుత భావించిన రాజగోపాల్‌రెడ్డి తాజా పరిణామాలతో రేవంత్‌రెడ్డినే కారణమన్న అంచనాకు వచ్చారని తెలిసింది. ఇక లంబాడీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వలేదని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ కూడా గుర్రుగా ఉన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో లంబాడీ సామాజికవర్గానికి చెందిన సత్యవతి రాథోడ్‌ను ఎలాంటి పదవి లేకున్నా కేసీఆర్ మంత్రివర్గంలోకి తీసుకుని ఆ తర్వాత ఎమ్మెల్సీగా చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. వీరంతా కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పావులు కదిపేందుకు సిద్ధవుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించిన ఏ విషయాలైనా తమతో సంబంధం లేకుండా సీనియర్ నేత జానారెడ్డితో సంప్రదించడాన్ని సైతం వీరంతా వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. ఇద్దరు సీనియర్ మంత్రులు, ఎంతోమంది సీనియర్ కాంగ్రెస్ నేతలు ఉన్న నల్లగొండ జిల్లాకు మొదటిసారి కొత్తగా మంత్రివర్గంలో చేరిన అడ్లూరి లక్ష్మణ్‌కు ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలను అప్పగించడంపై కూడా వీరు గుర్రుగా ఉన్నట్టు సమాచారం. వీటన్నింటికీ కారణమైన సీఎం రేవంత్‌రెడ్డికి భవిష్యత్తులో సందర్భం వచ్చినప్పుడు తమ సత్తా చూపాలన్న కసితో వారు రగిలిపోతున్నట్టు తెలిసింది. రాష్ట్ర సర్కార్‌లో ఏదైనా అనుకోని పరిణామాలు సంభవిస్తే నల్లగొండ జిల్లా నుంచే మొదలవుతాయన్న హెచ్చరికలు సైతం చేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుత పరిణామాలు ఎటువైపు దారితీస్తాయో వేచిచూడాల్సిందే.

రైతులందరికీ పెట్టుబడి సాయం!

› మొదటిపేజీ తరువాయి...

వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి సీఎం రైతు భరోసాను, 1,034 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వానికైనా రైతులు అండగా ఉంటేనే కుర్చీ బలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఇవ్వడం కష్టంగా ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కష్టాలను అధిగమించేందుకు రోజుకు 18 గంటల పాటు పని చేస్తున్నట్టు వివరించారు. సరిదిద్దుకునేందుకు కొంత కాలమైనా సమయం ఇవ్వరా అని ప్రశ్నించారు. ఎవరొచ్చినా తాను కలుస్తున్నానని, మంత్రులు, ఎమ్మెలేలూ కూడా నిత్యం ప్రజల్లో ఉంటున్నారని తెలిపారు. ఏడాదిన్నరలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు తెలిపారు. బకాయిలు విడుదల చేయాలంటూ మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారని, కానీ తాము అధికారంలోకి వచ్చే నాటికే వారి పదవీకాలం ముగిసిందని చెప్తూ, ఆ బకాయిలతో తమకు సంబంధం లేదన్నట్టు సీఎం మాట్లాడారు. లాభసాటి పంటల సాగు, వ్యవసాయ బావులకు సోలార్ విద్యుత్తు కనెక్షన్లపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఇతర రాష్ట్రాలు రేవంత్ పాలనను కోరుకుంటున్నాయి: తుమ్మల

తాను చేసే ప్రతి కార్యక్రమం దేశానికి ఆదర్శంగా ఉండాలని కోరుకునే ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అందుకే చుట్టు పక్కల రాష్ట్రాలన్నీ తెలంగాణ వంటి పరిపాలన కావాలని, సీఎం రేవంత్ రెడ్డి వంటి పాలన కావాలని కోరుకుంటున్నాయని తెలిపారు. మన పథకాలను చూసి పక్క రాష్ట్రాలు అమలు చేసే స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండబోవని, ప్రజా సేవకులుగా ఉంటామని చెప్పారు. మంత్రివర్గానికి స్వేచ్ఛ, మంత్రుల అభిప్రాయాలకు విలువనిచ్చే సీఎం రేవంత్‌రెడ్డి అని ప్రశంసించారు. అందరం కలిసి రేవంత్‌రెడ్డిని మంచి సీఎంగా నిలబెట్టాలని కోరారు.

2 ఎకరాల రైతులకు నిధులు జమ

రైతుభరోసా పంపిణీ తొలి రోజులో భాగంగా సోమవారం రెండెకరాల రైతులకు ఎకరానికి రూ. 6 వేల చొప్పున నిధులు జమ చేసినట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. మొత్తం 41.25 లక్షల మంది రైతులకు సంబంధించిన 39.16 లక్షల ఎకరాలకు గానూ 2,349.83 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. మిగిలిన రైతులకు 9 రోజుల్లో నిధులు జమచేస్తామని తెలిపారు.



ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, అధికారులు

వైద్య కళాశాలల అభివృద్ధికి కార్యాచరణ

- కళాశాలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- మూడేండ్లలో అన్ని కాలేజీల్లో సకల వసతులు కల్పించాలి :సీఎం

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వైద్య కళాశాలలన్నీ పూర్తిస్థాయి వసతులతో పనిచేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. వైద్యారోగ్యశాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కార్యాచరణ ప్రణాళికకు అధికారులతో కమిటీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ కావాల్సిన అవసరాల నివేదికను సమర్పించాలని సూచించారు. జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన వివిధ అంశాలపై చర్చించారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. దవాఖానలకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, దవాఖానల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎస్ రామకృష్ణారావు, సీఎంప్రధాన కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటికి తలంటు!

› మొదటిపేజీ తరువాయి...

శాఖలో మీరేందుకు వేలు పెడుతున్నారంటూ అసహనం వ్యక్తంచేశారు. ఈ పరిణామం కాంగ్రెస్‌వర్గాలనే ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వివరాల వెల్లడి నేపథ్యంలో ముఖ్యమంత్రికి, మంత్రులకు మధ్య సమన్వయలోపం బయటపడిందని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బహిరంగంగానే చర్చించుకుంటున్నాయి. సీనియర్ మంత్రులకు, సీఎంకు మధ్య రోజురోజుకు అంతరం పెరిగిపోతున్నదనే అభిప్రాయం బలపడుతున్నది. సోమవారం మంత్రివర్గ అంతర్గత సమావేశం నిర్వహించి, కీలక నిర్ణయాలు తీసుకున్నట్టుగా కలరింగ్ ఇచ్చి, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన 'రైతునేస్తం' వేదిక మీదనే బటన్ నొక్కి రైతుభరోసాను ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గానికి సమాచారం వెళ్లింది. తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేస్తామని చెప్పి, అదే వేదిక మీద స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటన చేయాలనుకున్నట్టు తెలిసింది. కానీ, ఖమ్మం పర్యటనలో మంత్రి పొంగులేటి అత్యుత్సాహంతో సీఎంను కాదని తానే ఎన్నికల నిర్వహణ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెలాఖరులోగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ రాబోతున్నదని ప్రకటించారు. అంత కంటే ముందే రైతుల ఖాతాల్లో రైతుభరోసా వేస్తామని కూడా చెప్పారు. మంత్రి సీతక్క కూడా స్థానిక ఎన్నికలపై కీలకమైన హింట్ ఇచ్చారు. ఎన్నికలపై నాలుగైదు రోజుల్లో స్పష్టత వస్తుందని చెప్పారు.

సీఎం నారాజ్

తన నిర్ణయానికి విరుద్ధంగా మంత్రి పొంగులేటి స్థానిక ఎన్నికల వివరాలను ముందే ప్రకటించడంతో సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనానికి గురైనట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. సోమవారం ఉదయం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను తన నివాసానికి పిలిపించి, మంత్రుల వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. తాను ఒక కార్యక్రమం తీసుకొని, ఏర్పాట్లు చేసుకున్నాక పొంగులేటి తనను కాదని ఎన్నికల వివరాలు ప్రకటించడంపై మండిపడ్డట్టు తెలిసింది. ఇటువంటి మంత్రులతో తాను పాలన ఎలా చేయాలని ఆవేదన వ్యక్తంచేసినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. పొంగులేటి చర్యలతో తీవ్ర అసహనానికిలోనైన సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం జరపతలపెట్టిన మంత్రివర్గ అంతర్గత భేటీని రద్దు చేయాలని భావించినట్టు తెలిసింది. ఇలా అర్ధాంతరంగా రద్దు చేస్తే.. ఎన్నికల ముందు ప్రతిపక్షాలకు ఆయుధం ఇచ్చినట్టు అవుతుందనే ఆలోచనతో మధ్యేమార్గంగా.. స్థానిక ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న మంత్రితో పాటు అతి కొద్దిమంది మంత్రులతో మాత్రమే సమావేశం నిర్వహించి, ఎన్నికల కార్యాచరణపై చర్చించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సీఎం చెప్పాకే మహేశ్ ఫైర్

సీఎంతో మాట్లాడి బయటికి వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ మంత్రి పొంగులేటి వ్యవహారశైలిపై మండిపడ్డట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మంత్రులు ఒకరి శాఖలో మరొకరు వేలు పెట్టడాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ తీవ్రంగా తప్పుపట్టారు. రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు ప్రకటన చేయడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఎవరి ఇష్టానుసారం వాళ్లు మాట్లాడితే పార్టీలో అసమ్మతికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయించాల్సిన అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడటం ఏమిటని అసహనం వ్యక్తంచేశారు. పార్టీతో సంప్రదించకుండా మంత్రులుగానీ, నాయకులు గానీ ఏకపక్ష ప్రకటనలు చేయరాదని హెచ్చరించారు.

సీతక్క ఎదరుదాడి

మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యల నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క మీడియా భుజాల మీద పెట్టి ఎదురుదాడికి దిగారు. స్థానిక ఎన్నికలపై నాలుగు రోజుల్లో స్పష్టత వస్తుందనే మాట మాత్రమే తాను చెప్పినట్టు వివరించారు. అంతకుమించి తానేమీ మాట్లాడలేదని స్పష్టం చేశారు. లోకల్‌బాడీ ఎన్నికలకు వారంలో నోటిఫికేషన్ వస్తుందని ఎక్కడా చెప్పలేదని, తనకు జ్ఞానం ఉన్నదని, క్యాబినెట్‌లో నిర్ణయం జరగకుండా తానెలా చెప్తానని వ్యాఖ్యానించారు. 'అడవి బిడ్డలం కాబట్టి మా విషయంలో మీడియాలో ఏదిపడితే అది రాయడం ఆవేదనకు గురిచేస్తున్నది'అని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలు తప్పుగా వెళ్తున్నాయని గ్రహించే అదేరోజు వివరణ కూడా ఇచ్చానని తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని, క్యాబినెట్‌లో స్పష్టత వస్తుందని భావిస్తున్నట్టు చెప్పారు.